క్లుప్తంగా

ముక్కంటి సేవలో దేవాంగ సంఘం అధ్యక్షులు



ఆలయం వద్ద పట్టం గణేష్ తదితరులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పశ్చిమగోదావరి జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు పట్టం గణేష్, కార్యవర్గ సభ్యులు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ యువజన అధ్యక్షుడు పులి రామచంద్ర పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రతి రైతు విధిగా రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ రైతు సేవా కేంద్రంలో నమోదు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు ఒక ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసేందుకేనన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఉంటేనే ప్రభుత్వ సబ్సిడీ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రేవతి, సిబ్బంది లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూతి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

భక్త కన్నప్ప ఆటో స్టాండ్ ప్రారంభం



ఆటో స్టాండ్ ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీకాళహస్తి: మండలంలోని ఊరందూరు నేషనల్ హైవే బైపాస్‌లో సోమవారం భక్తకన్నప్ప ఆటో స్టాండ్‌ను ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు జనమాల గురవయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆటోలను నడిపే డ్రైవర్లకు లైసెన్సులు, ఆటోలకు సంబంధించిన బీమా తప్పనిసరిగా ఉంచుకోవాలని ఆటో డ్రైవర్లను కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రోద్ద గోపి ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు మురళి ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు చారుశీల వీధి విక్రయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, బాబు భక్తకన్నప్ప ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మునికృష్ణ, తమీమ్, ధర్మేంద్ర, ఎస్.కె జుమ్లేష, ఉదయ్ కుమార్ యాదవ్, సుబ్రహ్మణ్యం సంతోష్ కుమార్ మా భాష, వాసు, రవి, అక్బర్ బాషా పాల్గొన్నారు

ఉపాధ్యాయుల నైట్ విజిట్



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆదివారం రాత్రి తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు నాదెండ్ల మురళి, ఆంగ్ల ఉపాధ్యాయుడు జగన్నాథంలు కల్లివెట్టు, తలారివెట్టు, కురింజలం గ్రామాల్లో నైట్ విజిట్ చేపట్టారు. పదో తరగతి విద్యార్థుల ఇంటి వద్దకు రాత్రి పూట వెళ్లారు. పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు మనో ధైర్యం కల్పించారు. మెరుగైన మార్కులు సాధించడానికి చక్కని ప్రశాంత వాతావరణం ఇంటి వద్ద కల్పించాలని సూచించారు.

కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అంటూ గత ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ఎన్నో పథకాలు ఇస్తామంటూ నమ్మించారు. తీరా అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా వీటి అమలుకు నోచుకోలేదు. చెప్పిన వాగ్దానాలు అమలు చేయకుండా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. తాజాగా పీ–4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తేసేందుకు శ్రీకారం చుట్టారు.
– వరదయ్యపాళెం

వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో పీ-4 సర్వే చేస్తున్న పంచాయతీ ఈఓ, సచివాలయ సిబ్బంది



వరదయ్యపాళెం మండలంలో పీ-4 సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ



పీ-4 పిడుగు!

- పేదలపై సర్వే ప్రయోగం
- 27 రకాల ప్రశ్నలతో కుటుంబ సర్వే
- ఇంటిలోని విలువైన వస్తువుల వివరాల నమోదు
- సంక్షేమ పథకాలు తొలగిస్తారేమోనని ఆందోళన
- సచివాలయ ఉద్యోగులపై పని భారం

కొనసాగుతున్న సర్వే

ఫోన్, టీవీ, ఏసీ ఇతర గృహోపకరణాలు, బైకులున్నాయా, ఇళ్ల స్వరూపం, బ్యాంక్ అకౌంట్ ఇలా 27 రకాల ప్రశ్నల్ని సంధించి సమాధానాలను సేకరించి సంబంధిత వివరాలను సచివాలయ సిబ్బంది నింపాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసే ప్రక్రియతో సర్వేను ముగిస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో వరదయ్యపాళెం, బీఎస్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 85,140 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల్లో అప్పోసప్పో చేసి నెలవారీ వాయిదాల్లో ఏసీలను ఎక్కువ మంది ఏర్పాటు చేసుకున్నారు. ఏసీ ఉందని తెలిస్తే చాలు సచివాలయ సిబ్బంది ఆ వివరాలను ప్రభుత్వ రికార్డుల్లోకి నమోదు చేస్తున్నారు. దీంతో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది. వివిధ గ్రామాల్లో ప్రస్తుతం ఈ సర్వే చడీచప్పుడూ లేకుండా జరుగుతోంది. ఒక్కొక్క సచివాలయ ఉద్యోగి రోజుకు తమ పరిధిలోని 200 కుటుంబాల్లో సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. పనిభారంతో వారిలో కూడా ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను జవాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, ఆరేళ్ల పిల్లల ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ రెసిడెన్స్ సర్వే, ఇంటి పన్నులు, కుళాయి పన్నుల వసూళ్లతోపాటు ఆయా సర్వేలపై ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్నారు. చిన్న విషయానికి కూడా కార్యదర్శులను వివరణ అడుగుతుండడంతో సచివాలయ సిబ్బంది పనిభారంతో సతమతమవుతున్నారు.

నిరాకరించినా.. నిర్బంధం

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే. స్మార్ట్ ఫోన్లు, బైక్‌లు ఇలాంటి ప్రశ్నలు ఉండడంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది. పీ–4 సర్వేను నిబంధనలను అనుగుణంగా నిర్వహించాలని, దీని ద్వారా సరైన పౌర సమాచారం ప్రభుత్వానికి అందుతుందని అధికారులు అంటున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎంపీడీఓలు కింది స్థాయి అధికారులకు చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహదపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని సిబ్బందికి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు అంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది.

సత్యవేడు నియోజకవర్గంలో పీ-4 సర్వే చేసిన కుటుంబాల వివరాలు:

మండలం	కుటుంబాలు
పిచ్చాటూరు	10159
కేవీబీపురం	13183
నారాయణవనం	10936
సత్యవేడు	15211
నాగలాపురం	10336
వరదయ్యపాళెం	14867
బీఎస్‌కండ్రిగ	10448
మొత్తం	85140

చలో విజయవాడకు తరలిరండి

సత్యవేడు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో మంగళవారం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న మహిళా కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. వంట సామగ్రి సరఫరా చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలనే డిమాండ్లతో విజయవాడలో చేపట్టే ఆందోళన కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికులు భారీగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల నాయకులు శాంతి, లక్ష్మీ, రత్నమ్మ, ప్రభావతి, శ్యామల, ధనలక్ష్మీ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బాలాజీ

సత్యవేడు: భారతీయ జనతా పార్టీ సత్యవేడు మండల నూతన అధ్యక్షుడిగా ఎస్.బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టీడీ వరప్రసాద్, జిల్లా ఆర్‌ఓ రాటకొండ విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిని ఎన్నుకొన్నారు. బండారు మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

30న కవి సమ్మేళనం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 30న కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 30న విశ్వావసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా స్వామి వారి ప్రధాన ఆలయం ఎదుగ ఉగాది పంచాంగ శ్రవణం, కవిసమ్మేళనం ఉంటుందన్నారు.

ఉపాధి పనుల వద్ద వసతులు కల్పించాలి



వినతి పత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనుల వద్ద కూలీలకు సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలసి ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడంతో ఉపాధి పనుల వద్ద తాగునీటి సౌకర్యంతోపాటు టెంట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి, పరిష్కరించాలన్నారు. పల్లె పండుగలో వేస్తున్న సీసీ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, ఏపీఓ భానుప్రియ, ఏఓ భారతి, ఏపీఎం మునెయ్య, ఆర్ఐ నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా మెరుగు పరచాలి



ఆకతాయిలు ధ్వంసం చేసిన పైపులు

సత్యవేడు: చెన్నేరి పంచాయతీలో లేఅవుట్లకు అమర్చిన నీటి పైపులను ఆకతాయిలు ధ్వంసం చేయడంతో నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి లేఅవుట్‌లో119 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. పట్టాలతోపాటు గృహాలు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం రూ.1.80లక్షలు మంజూరు చేసింది. 2022నుంచి ఇక్కడ పక్కాగృహాలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం వివిధ దశల్లో 39 గృహాలను నిర్మిస్తున్నారు. నీటి సరఫరా కోసం అమర్చిన పైపు విరిగి పోవడంతో ఇంటి నిర్మాణాలకు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. తరచూ పైపులను ఆకతాయిలు పాడు చేస్తుండడంతో పంచాయతీకి అదనపు భారంగా మారింది. నీటి సరఫరా పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

సర్దుబాటు చేయండి సారూ



బయట వేచి ఉన్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పదవ తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి మొదలయ్యాయి. అయితే ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. మిగిలిన తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1గంటకు పాఠశాలలకు చేరుకోవాలని చెప్పడంతో ఆ విద్యార్థులు 12.30 గంటలకే పాఠశాలల వద్ద బారులు తీరుతున్నారు. అసలే వేసవి కావడంతో ఆ ఎండలోనే విద్యార్థులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అలా కాకుండా వారికి 1.30గంటలకు సమయం కేటాయిస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సమయం సర్దుబాటు చేస్తే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది.

పట్టాలు రద్దు చేయాలి



కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం రాజులకండ్రిగ గ్రామంలోని సర్వే నెంబరు 414లో 13 ఎకరాల దళితుల భూమిని అదే గ్రామానికి చెందినవారు ఆక్రమించుకుని పట్టాలు చేసుకున్నారని, వాటిని తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం, బీఎస్పీ ఆధ్వర్యంలో కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కేవీబీపురం మండలంలో అనేక గ్రామాల్లో దళితులకు చెందిన భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆక్రమిత భూముల పట్టాలు రద్దు చేయాలని కోరారు. తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధన, సీపీఎం నాయకులు మునిశంకర్, వరలక్ష్మి, పురుషోత్తం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల మధ్య చిచ్చు పెట్టొద్దు



దుడ్డు వేణు

వరదయ్యపాళెం: ఓటు బ్యాంకు రాజకీయం కోసం అన్నదమ్ముల్లా ఉన్న దళితుల మధ్య వర్గీకరణ పేరుతో కూటమి ప్రభుత్వం చిచ్చు పెడుతోందని వైఎస్‌ఆర్ సీపీ ఎస్సీ సెల్ సత్యవేడు నియోజకవర్గ అధ్యక్షుడు దుడ్డు వేణు ఆరోపించారు. సోమవారం వరదయ్యపాళెంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వేణు మాట్లాడారు. దళితుల సంక్షేమం, అభివృద్ధికి వైఎస్‌ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారని తెలిపారు. అన్నదమ్ములా ఉన్న దళితులను విభజించు..పాలించు అన్న సిద్ధాంతంతో సీఎం చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారని తెలిపారు.

ప్రభుత్వం 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సత్యవేడు: ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఏపీ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.నాగేశులు కోరారు. సోమవారం సత్యవేడు రిటైర్డు ఎంప్లాయిస్ రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి కమిషనర్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. రిటైర్డు ఎంప్లాయిస్‌కు రావాల్సిన డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు ఇవ్వాలని, 70 సంవత్సరాలకు 10 శాతం, 75 సంవత్సరాలకు 15 శాతం పునరుద్ధరించి, పాతపద్ధతిలో ఇవ్వాలని కోరారు. ఈహెచ్‌ఎస్ కార్డుపై క్యాష్‌లెస్ వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఎ.బలరాముడు, పి.రవిబాబు, నరసయ్య, సుబ్బరామయ్య, వి.చంద్రశేఖర్, గోపాల్, ఈశ్వరయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో సోమవారం ఆర్ మల్లవరానికి చెందిన సుబ్రహ్మణ్యం నడిచి వెళ్తుండగా తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు ఆటోలో చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అర్బన్ పోలీసులు కేసును విచారిస్తున్నారు.

మెడికల్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ బృందం

నాగలాపురం: మండల కేంద్రంలోని నందనం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. మొదట ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బంది, డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే గర్భవతులు, బాలింతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రోగులకు ఆరోగ్య కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలను అందిచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంపీఓ.శ్రీనివాసులు, డీపీఓ ప్రకాష్, నాగలాపురం వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, సీహెచ్‌ఓ వేణుగోపాల్, మంజుల దేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

శ్రీకాళహస్తి: వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సందర్భంగా నియోజకవర్గంలోని పలు పాఠశాలలో పిల్లలకు ఉచితంగా విద్యాసామగ్రి అందజేశారు. తొట్టంబేడు మండలం, పాయ్య, లింగమ నాయుడు పల్లి, రౌతు సూరమాల, మల్లిగుంట, కల్లిపూడి, గురుకుల పాలెం, చిన్న సింగమల, పెద్ద సింగమల, బసవయ్య పాలెం, ఇలగనూరులో సుమారు 1,168 పుస్తకాలను ఉచితంగా పిల్లలకు అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసుదేవనాయుడు తదితరులు

అమరా ఆస్పత్రిలో రోబోటిక్ శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స చేయించుకున్న వ్యక్తితో వైద్య బృందం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): అమరా హాస్పిటల్ తన మొట్టమొదటి రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సతో మరో మైలురాయిని సాధించిందని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి అన్నారు. అమరా హాస్పిటల్లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తిరుపతిలోకి రోబోటిక్ శస్త్రచికిత్స అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఈ రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను సమర్థవంతంగా చేసినట్లు వివరించారు. తీవ్రమైన స్టెనోసిస్‌తో డీజెనరేటివ్ అయోర్టిక్ వాల్వ్‌తో బాధపడుతున్న 65 ఏళ్ల మహిళకి ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్(టివి)ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవి కుమార్, అనస్థీషియాలజిస్టులు డాక్టర్ అనిల్, డాక్టర్ రాకేష్, ఓటీ మేనేజర్ పరశురాం, స్వప్న, కరీం, రాకేష్, ఆకాష్, ఓటీ సిబ్బంది పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



స్థానికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

ఏర్పేడు(రేణిగుంట):ఏ గ్రామంలో నైనా విషజ్వరాలు ఉంటే వైద్యులు అప్రమత్తమై, అక్కడ ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి జ్వరాలను అదుపులోకి తీసుకురావాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బాలకృష్ణ నాయక్ ఆదేశించారు. ఏర్పేడు మండలం మాధవమాలలో విష జ్వరాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్‌కు సోమవారం గ్రామస్తులు ఫిర్యాదు చేయటంతో ఆయన హుటాహుటిన గ్రామానికి చేరుకుని పరిశీలించారు. ఇంటింటి సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి మెడికల్ క్యాంపు నిర్వహించాలని సూచించారు. జ్వరపీడితుల రక్తనమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపాలని వైద్యాధికారి డాక్టర్ శివప్రియను ఆదేశించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



వరదయ్యపాళెం: విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

రేణిగుంట/వరదయ్యపాళెం/బుచ్చినాయుడుకండ్రిగ, శ్రీకాళహస్తి/రూరల్/సత్యవేడు: రేణిగుంట మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు తెలుగు పరీక్షకు 1,057 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 1041 మంది విద్యార్థులు హాజరయ్యారు. 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఇందిరా దేవి తెలిపారు. పదో తరగతి పరీక్షలు ఏర్పేడు మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 800 మంది విద్యార్థులకుగాను 790 మంది పరీక్ష రాశారు. పదిమంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వరదయ్యపాళెం మండలంలో 432కి గాను 419 మంది హాజరైనట్లు ఎంఈఓ సరస్వతి తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో 306 మందికి గాను 12 మంది గైర్హాజరు కాగా, 294 మంది హాజరయ్యారు. శ్రీకాళహస్తి పట్టణంలో మొత్తం 12 కేంద్రాల్లో 2019 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 11మంది గైర్హాజరయ్యారు. సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో 390 మందికి గానూ ఇద్దరు గైర్హాజరు కాగా, 388 మంది పరీక్షలు రాశారు. బాలికల గురుకుల పాఠశాలలో 198 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఇంటి పట్టాల కోసం వినూత్న నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ఆరో రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నెంబర్‌లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాల కోసం స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు లేక ఒకే ఇంటిలో మూడు కాపురాల వారు ఉంటున్నారని తెలిపారు. ఇంటి పట్టాలు ఇచ్చే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య, గ్రామస్తులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరాస్వామి, మణి, గోయల్ బాబు, గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఏపీఎం డాక్టర్ డాంగేయాదవ్

సత్యవేడు: పొదుపు సంఘాల సమగ్ర సమాచారాన్ని లోకోస్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ అన్నారు. సోమవారం స్త్రీశక్తి భవనంలో లోకోస్ యాప్‌పై సంఘమిత్రలకు మూడురోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) ఆధ్వర్యంలో లోకోస్ అనే కొత్త యాప్ మే నెల నుంచి అందుబాటులో ఉందన్నారు. ఈ యాప్ వ్యక్తి గత సమాచారం, డ్వాక్రా సంఘాలు తీసుకొంటున్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు యాప్‌లో నమోదు చేయాలని సంఘమిత్రలకు ఏపీఎం సూచించారు. శిక్షణా కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు పుల్లయ్య, పురుషోత్తం, మంగయ్య, సంఘమిత్రలు పాల్గొన్నారు.